నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం | సెప్టెంబర్ 20, 2023 | www.navatelangana.com

అర్ధనగ్న ప్రదర్శనతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్(బోధన్)



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన..

తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ఆందోళనలు మంగళవారంతో 18వ రోజుకు చేరుకున్నాయి. దీంట్లో భాగంగా మంగళవారం అర్ధనగ్న ప్రదర్శనతో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి.. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అశ్రఫ్ , అధ్యక్షులు దిలీప్, కార్యదర్శి రాజు, కోశాధికారి ప్రసాద్ , అంజయ్య , విజయ్, సురేందర్ ,అంబదాస్ రావు, భూపేందర్ ,యూసుఫ్ అలీ, బాలరాజ్ , శివానంద,లక్ష్మి నారాయణ ,రమలత ,రాకేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నుంచి షేక్ అల్తాఫ్ బహిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్న షేక్ అల్తాఫ్‌ను ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్. అజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎఫ్ఐ సంఘం కార్యకలాపాలకు, నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నందుకు ఎస్ఎఫ్ఐ నుండి బహిష్కరిస్తున్నమని పేర్కొన్నారు. ఇక నుంచి ఎస్ఎఫ్ఐతో అల్తాఫ్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు.

కొలువుదీరిన గణనాథులు

- కోలాహలంగా ప్రతిష్టాపన

నవతెలంగాణ-కంఠేశ్వర్



డీజేలు ఏర్పాటు చేసుకొనినృత్యం చేస్తూ గణనాథుడిని తీసుకెళ్తున్న యువకులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథులు కొలువు దీరాయి. ముస్తాబుచేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

నగరంలో అనాదిగా వస్తున్న సాంప్రదారుం కొనసాగిస్తూ పెద్ద రామ్ మందిరాల వద్ద పూజలు నిర్వహించి అయా మండపాలకు వినాయక విగ్రహాలను తరలించారు. డీజే చప్పులు, బ్యాండు దరువుల మధ్య నృత్యాలు చేస్తూ గణనాథులను ప్రతిష్ఠించేందుకు తరలించారు. భారీ విగ్రహాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగరంలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం గణపతి లను తీసుకువచ్చే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఆర్మూర్ బోధన్ ఏసీబీల పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా సీపీ పర్యవేక్షించారు.





భారీ గణనాథుడిని తరలించేందుకు యువకుల ఏర్పాట్లు.. ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తూ..



ఆటోలో తరలిస్తూ..

లక్షలు వెచ్చించినా లక్ష్యం చేరట్లే



కంపోస్టు షెడ్డులో మద్యం సీసాలు

• ఊరవతల మందుబాబులకు అడ్డాగా మారిన కంపోస్టు షెడ్లు

- చెత్త తరలించకుండా, ఎరువు తయారు చేయకపోవడంతో నిరుపయోగంగా మారిన వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టని అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ట్రాక్టర్ ద్వారా తరలించి.. కంపోస్టు షెడ్డులో ఎరువు తయారు చేయించి దాన్ని విక్రయించి పంచాయతీలు ఆదాయం పొందాలనే ఉన్నతమైన లక్ష్యంతో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయో గంగా మారాయి. పంచాయతీలు పట్టించుకోక పోవడంతో కంపోస్టు షెడ్లు మందుబాబులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దకొడప్‌గల్ మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలు పరిధిలో కంపోసిట్లు మందుబాబులకు అడ్డాగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ఎన్నో లక్షలు రూపాయల వ్యయంతో కంపోస్టల నిర్మాణం చేపట్టినప్పటికీ అవి కొన్ని గ్రామాలలో ఉపయోగంలోలేక నిరుపయోగంగా మారాయి.

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం వ్యాప్తంగా 24 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతి గ్రామపంచాయతీల్లో రూ 2.60 లక్షలు వెచ్చించి కంపోస్టు షెడ్లు నిర్మించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్టు షెడ్డుకు తరలించాల్సి ఉంటుంది. తడి చెత్తను ఎరువుగా తయారు చేసి విక్రయించి జీపీలు ఆదాయం పొందాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. వాటిని నిర్మించిన కొత్తలో బాగానే వినియోగించినా... క్రమంగా వాటి నిరుపయోగంగా మార్చారు.

ఆదాయం లేమితో..

పలు గ్రామాల్లో సిబ్బంది కొరత వేధిస్తున్నట్టు సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఆదాయం లేమితో అదనంగా సిబ్బందిని నియమించుకోలేకపోతుండగా.. మరికొన్ని చోట్ల ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో చెత్త సేకరణ నిలిచిపోతోంది. ఫలితంగా కంపోస్టు షెడ్డులకు చెత్త తరలకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో పాటు ఊరికి చాలా దూరంలో నిర్మించడంతో సరైన రోడ్డు మార్గం లేక, దూరాబారంతో ట్రాక్టర్‌ను తీసుకెళ్లలేకపోతున్నారు.

మందుబాబులకు అడ్డా

కంపోస్టు షెడ్లను నిర్మించి వదిలేయడంతో వాటిని పట్టించుకునే వారు కరువైయ్యారు. ఫలితంగా మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మండలం లోని పలు గ్రామాలైన బేగంపూర్, అంజని, సముందర్ తాండ, లింగంపల్లి విట్టల్వాడి, విట్టల్వాడి తండాలలో పరిశీలించగా.. నిరుపయోగంగా మారి మందుబాబు లకు అడ్డాగా మారినట్టు దర్శనమిచ్చాయి. మండలం లోని ఇతర గ్రామాల్లో సైతం ఇదే విధంగా ఉన్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని భోగట్ట.

ప్రభుత్వం రైతులకు ఎరువులను సరఫరా చేయాలనే లక్ష్యం నీరు కారిపోతుంది. రైతులకు ఎరువులు సరఫరా చేయాలని మంచి ఉద్దేశంతో కంపోస్టు ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి ఎరువులు తయారీ ప్రక్రియ జరగడం లేదని విమర్శలు ఉన్నాయి ఉపయోగం లేక నిరుపయోగంగా ఉండడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. గ్రామాలలో పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్ట్ షాపుల వెలవడంతో గ్రామాల్లో ఉండే కొంతమంది కంపోస్టుషెడ్లను అడ్డాగా మార్చుకున్నారు. మందు బాబులు ప్రతిరోజు మద్యం సేవించి కంపోస్టులో ఖాళీ సీసాలు వదిలి వెళ్తున్నారు. మద్యం సేవించి నానా హంగామా చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన కంపోస్టులు నిరుపయోగంగా మారడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన కంపోస్టులో సేంద్రియ ఎరువులు తయారయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రతి గ్రామంలో ట్రాక్టర్ ద్వారా తడి చెత్తను పొడి చెత్తను స్వీకరించాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.





సముందర్‌తండాలో నిరుపయోగంగా మారిన కంపోస్ట్ షెడ్డు

అంగన్‌వాడీ మృతికి నివాళి

నవతెలంగాణ-వర్ని

మండలంలోని వకీల్ ఫారం గ్రామానికి చెందిన అంగన్ వాడీ టీచర్ సీహెచ్. మంగా (47) సోమవారం సాయంత్రం 4 గంటలకు మృతి చెందింది. గత సంవత్సరం నుండి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుంది. ఆమె స్వగ్రామం వకీల్ ఫారం కాగా, అఫంధి ఫారంలో విధులు నిర్వహించేది. ఆమె మృతికి సంతాప సూచికంగా మోస్రా మండల కేంద్రంలో అంగన్ వాడీ ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీఐటీయూ నాయకులు నన్నేసాబ్, అంగన్ వాడీ యూనియన్ నాయకురాలు కరుణ దేవి, ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీనా, సురేఖ రాణి, సుమలత, ఎలిజబెత్ రాణి, జయశ్రీ శ్రీలత అహ్మది, సుప్రియ తదితరులు పాల్గొన్నారు

దళిత కుటుంబాలన్నింటికీ దళితబంధు అందజేయాలి

- కలెక్టరేట్ తరలిన వివిధ గ్రామాల దళిత కుటుంబాలు



కలెక్టరేట్‌కు తరలుతున్న ఇరు గ్రామాల దళిత కుటుంబీకులు

నవతెలంగాణ-పిట్లం

దళిత కుటుంబాల అందరికీ 'దళితబంధు' అందజేయాలని పిట్లం ,చిల్లేర్గి గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు మంగళవారం తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో కుటుంబీకులందరూ తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాలలో 300కు పైగా దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, ఎటువంటి గూడు , ఉపాధి లేక దుర్భర జీవితం గడుపుతున్నామన్నమని తెలిపారు. పిట్లం , చిల్లేర్గి గ్రామాల అధికార పార్టీ నాయకులు కేవలం వారి అనుచరులైన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే దళిత బంధు అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుపేద అర్హులను గుర్తించి ఇవ్వకుండా కార్యకర్తల కుటుంబాలకే అందజేస్తున్నారని వాపోయారు. అంతేకాకుండా డబుల్ బెడ్ రూమ్ అర్హులకు కూడా దళిత బంధు కల్పిస్తు న్నారని.. ఉన్నవారికి అన్నీ ఇచ్చి లేని వారికి ఏమీ ఇవ్వడంలేదని వాపోయారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అర్హులందరికీ దళితబంధు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్లం , చిల్లేర్గి గ్రామాల దళిత సంఘులు , దళిత మహిళలు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాల్లో బలవర్థక బియ్యం పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో రేషన్ కార్డుదారులకు బలవర్థక బియ్యం పంపిణీ చేయనున్నట్టు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు కోటా బియ్యం సెప్టెంబర్‌లో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్డుదారులకు సూక్ష్మ పోషకాలను అందించే ఉద్దేశంతో పోర్టిఫైడ్ రైస్ 'పోషకాలతో కూడిన బలవర్ధకమైన బియ్యం) పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ బియ్యంలో మూడు అత్యంత ఆవశ్యక సూక్ష్మ పోషకాలైన ఐరన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్- బీ12 లు నిర్ధారిత మోతాదులలో కలపబడి ఉంటాయని పేర్కొన్నారు. ఇవి అనేమియా, సూక్ష్మ పోషక తత్వాల నుంచి ప్రజల్ని కాపాడతాయని పేర్కొన్నారు. ఐరన్ ఎనీమియా (రక్తహీనత) నుంచి రక్షణ లభిస్తుంది. శరీరంలో అలసట తగ్గిస్తోంది. నెలలు నిండకుండా ప్రసవం అవ్వడం, బరువు తక్కువగా పుట్టడం వంటి ప్రసవ సంబంధిత సమస్యలు తలెత్తవు.

ఫోలిక్ ఆసిడ్ : శరీరంలో తగినంత రక్తము తయారు కావడానికి సహాయపడుతుంది. గర్భస్థ దశలో నరాల బలహీనత వలన పుట్టే బిడ్డలలో పుట్టుకతో వచ్చే రుగ్మతల నుంచి రక్షణ కల్పిస్తుంది.

విటమిన్ బీ-12 : మెదడు, నాడీ వ్యవస్థను సక్రమంగా పనిచేయడంలో సహకరిస్తుంది. శరీరంలో రక్తం తయారు కావడానికి సహకరిస్తుంది. ఈ బియ్యమును బియ్యం పిండి, విటమిన్, ఖనిజాల మిశ్రమంతో తయారు చేస్తారు. జిల్లాలోని అందరికార్డుదారులకు తెలియజేయునది ఏమనగా పొరిటిఫైడ్ బియ్యంలో వేరుగా కనిపించే గింజలు ప్లాస్టిక్‌తో చేసిన బియ్యం కాదు. ఈ బియ్యంలో అవసరమైన సూక్ష్మ పోషకాలు ప్రభుత్వం చే నిర్ధారితమైన మోతాదులో కల్పబడినట్లు తెలిపారు. ఈ బియ్యం ను నీళ్లలో వేసిన ఎడల పైకి తేలుతాయి. ఇట్టి తేలిన బియ్యాన్ని పడేయకుండా బియ్యంతో పాటు కలిపి వండుకొని తినాలని సూచించారు.

ముఖ్య గమనిక: తల సేమియా వ్యాధి ఉన్నవారు ఇట్టి పొరిటిఫైడ్ బియ్యం తినకూడదు.

విఘ్నేశ్వరా.. ప్రభుత్వం నిద్రమత్తు వీడాలి

- విగ్రహానికి వినతి ఇస్తూ అంగన్‌వాడీల వేడుకోలు
- సమ్మె శిబిరంలో వినాయక చవితి వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్/రామారెడ్డి



జుక్కల్‌లో సమ్మె శిబిరంలో వినాయకుడిని ప్రతిష్ఠించి వినతి అందజేస్తున్న అంగన్‌వాడీలు

తాము సమ్మె చేపట్టినా ప్రభుత్వం, పాలకులు పట్టకుండా వ్యవహరిస్తున్నారు.. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలి అంటూ అంగన్‌వాడీలు వినాయకుడికి వినతిపత్రం ఇచ్చి వేడుకున్నారు. కనీస వేతనం అమలు చేసి, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, వేతనంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని గత సోమవారం నుంచి అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టిన విషయం విధితమే. అయితే వినాయక చవితి పురస్కరించుకొని తమ సమ్మె శిబిరాల్లోనే వేడుకలు నిర్వహించారు. వినాయకుడి ప్రతిమలు నెలకొల్పి పూజలు చేసి వినతిపత్రాలు సమర్పించారు.

జుక్కల్ మండలంలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్‌లు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. సిఐటీయూ అంగన్ వాడి సంఘం అద్యక్షురాలు సుమలత టీచర్లు, ఆయాలతో కలిసి వివిధ రూపాలలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ఎనమిదవ రోజు వినయక చవితి పండుగ సందర్బంగా సమ్మె శిబిరంలో వినాయక విగ్రహం ప్రతిష్ఠించి హారతి, పూజలు నిర్వహించి తమకష్టాలు తీర్చాలని , ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించి సమస్యలను పరిష్కరించాలని కోరుతు వినాయక విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్ వాడి సంఘం నాయకురాలు ఖండేబల్లూర్ సుమలత, దీవేన, మహమ్మదాబాద్ తాండా లక్ష్మీ, జుక్కల్ చెంచకల, హన్మవ్వ, సాయవ్వ, యశోదా, మైబాపూర్ రాదా, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలోనే పండగ

రామారెడ్డి : అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరిం చాలని గత తొమ్మిది రోజుల నుండి సమ్మె బాటలో పట్టిన అంగన్వాడీలు, 8 వ రోజు మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మెలోనే వినాయక చవితి వేడుకలను నిర్వహించుకున్నారు. 9వ రోజు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి, స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మభ్య పెట్టే వారి మాటలు నమ్మొద్దు

- కాంగ్రెస్ నాయకులవి మాటలే.. బీఆర్ఎస్‌ది చేతల ప్రభుత్వం
- రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట
- రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్
- స్పీకర్‌తో కలిసి గురుకులాలను ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మాట్లాడుతున్న స్పీకర్, మంత్రి

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థి కోసం పెద్దపీట వేస్తున్నారని దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయ కులు మభ్యపెట్టే మాటలు చెప్తున్నారని, వారి మటలు నమ్మొద్దని సూచించారు.

మంగళవారం బాన్సువాడ నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సత్యవతి రాథోడ్ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఉదయం నసురుల్లాబాద్ మండలంలోని దుర్గి గ్రామ శివారులో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను అద్దె భవనంలో ప్రారంభించారు. అలాగే నసురుల్లాబాద్ మండల కేంద్రంలో గిరిజన బాలు గురుకుల పాఠశాల 12 కోట్లతో వసతి అనతిగృహం 12 అదనపు గదుల పనులపై శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి బాన్సువాడ మండలం కోనాపూర్ ఇబ్రహీంపేట్ గ్రామాల్లో 12 కోట్ల రూపాయలతో గిరిజన బాలికల గురుకుల పాఠశాల నూతన భవనం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నసురుల్లాబాద్ మండలంలో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ. ఈమధ్య కాంగ్రెస్ నాయకులు వారికి తోచిన పథకలుస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న కర్ణాటక , చత్తీస్గడ్ రాష్ట్రంలో కనీసం పెన్షన్ 2000 ఇవ్వడం లేదన్నారు. కల్లిబొల్లి మాటలు మాట్లాడే కాంగ్రెస్ నాయకులు మాటలు నమ్మవద్దు అన్నారు.

తాను జన్మించిన మూల తండాలో కనీసం ఒక బడి కూడా అందుబాటులో లేక పోవడంతో చదువుపై ఉన్న ఆసక్తితో పక్కనే ఉన్న గుండ్రాతి మడుగుకు కాలినడకన వెళ్లి అక్కడ ఏడవ తరగతి వరకు చదువుకున్నామన్నరు. ఆడపిల్లలను దూర ప్రాంతాలకు చదువులకు పంపించే ధైర్యం చేయని తల్లిదండ్రులు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలు గురుకుల విద్యాలయాలలో కనీస సౌకర్యాలు కలిపంచకపోవడంలో విఫలం చెందారని ఆమె ఆరోపించారు.

గుడిసెలేని నియోజకవర్గం కావాలి : స్పీకర్ పోచారం

బాన్సువాడ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇండ్లను మంజూరుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు టీమ్ వర్క్ గా పని చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో గిరిజన పాఠశాల వసతి గృహంల నిర్మాణం పనులను శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాన్సువాడ ఆదర్శంగా నిలిచిందన్నారు. బాన్సువాడని నియోజకవర్గంలో ప్రతి మండలంలో రెండేసి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎంపీపీ పాల్త్య విట్టల్ జెడ్పిటిసి జన్ను భాయ్ ప్రతాప్ సింగ్, పార్టీ మండల అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, మండల్ కోఆప్షన్ నెంబర్ ముస్తఫా హుస్సేన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

నవతెలంగాణ-రుద్రూర్(వర్ని)



కల్లుబట్టిలో గొడవ జరగడంతో తనపై ఎక్కడ కేసు పెడతారో అనే భయంతో ఓ యువకుడు ఏకంగా సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. ఈ ఘటన రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. కల్లుబట్టిలో గొడవ జరగడంతో తనపై ఎక్కడ కేసు పెడతారేమోనని భయాందోళనకు గురై టవర్ ఎక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని యువకుడిని సముదాయించడంతో రాత్రి 7 గంటల సమయంలో కిందకు దిగాడు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని భరత్ పెట్రోల్ బంకు వద్ద గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కమ్మర్ పల్లి శివారులోని భరత్ పెట్రోల్ బంకు దగ్గర ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా కోరుట్లకు చెందిన మొహమ్మద్ సాహెబ్ బార్, మహమ్మద్ ఇర్ఫాన్, ఐలాపూర్ కు చెందిన సిరిగిరి సందీప్‌గా గుర్తించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉన్నట్టు తెలిసింది. వెంటనే కమ్మర్ పల్లి తహసిల్దార్ ఆధ్వర్యంలో వారి ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 300 గ్రాముల గంజాయి, ఒక బైకు, మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. గంజాయితో సంబంధం ఉన్న వీరి మరో స్నేహితుడు ఐలాపూర్‌కు చెందిన బన్నీగౌడ్ ఏ కేకే అను వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి


నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగురోజులుగా సిబ్బంది చేపట్టిన నిరసనలకు మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలిపారు. రాష్ట్రంలో తమకు అనుకూలంగా పని చేసే ఉద్యోగస్తులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేస్తుందని , ఎమ్మెల్యే , ఎమ్మెల్సీలకు ఇష్టానుసారంగా జీతాలు పెంచుకుంటున్నారని అన్నారు. యూనివర్సిటీ విషయానికి వస్తే ఎలాంటి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల కోసం నిరంతరం పని చేస్తున్న కార్మికులని పట్టించుకోక పోవటం దారుణమని, కార్మికులకు పనికి సమనవేతనం ఇవ్వాలని , అందరిని పర్మినెంట్ చేయాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు పవన్, రవీందర్, శివ సాయి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న బాజిరెడ్డి గోవర్ధన్

- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన కొట్టాడి చిన్నయ్య ఆయన భార్య కూతురు ధర్మారం(బి) శివారులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అటుగా వెళ్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ తన కాన్వాయ్‌ను ఆపి.. క్షతగాత్రుల క్షేమసమాచారాలు తెలుసుకొని వెంటనే 108కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. అనంతరం డాక్టర్‌లతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

చీకట్లో వినాయకుని తరలింపు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని తానకుర్తి గ్రామంలో చిమ్మ చీకట్లో వినాయకుని విగ్రహాలను తరలించారు. వారం రోజుల నుండి గ్రామంలోని నడి మధ్యలో హనుమాన్ టెంపుల్ పక్కన వీధిదీపాలు రావడంలేదని పంచాయతీ కార్యదర్శి కి చెప్పినా కూడా ఇప్పటివరకు స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించిలని గ్రామస్తులు కోరుతున్నారు..



చీకట్లో వినాయక ప్రతిమలు తరలిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ
నిజామాబాద్
బుధవారం సెప్టెంబర్ 20, 2023 www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన మోతే యువకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం మోతే గ్రామానికి చెందిన 40 మంది యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే యువతకు, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీనీ ముత్యాల సునీల్ కుమార్‌ను గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. పార్టీలో చేరిన యువకులకు ముత్యాల సునీల్ కుమార్ పార్టీ ఖండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్రైడి సురేష్, బేజ్జోరా మాజీ సర్పంచ్ మూడెడ్ల అశోక్, మహిపాల్, జుబైర్, నవీద్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోండి

ఎమ్మెల్యే బాజిరెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

వినాయక చవితి సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఇంటికి వచ్చిన నాయకులకు నా దగ్గరికి మీరంతా రావద్దు.. మనం ప్రజల మనిషిగా గుర్తింప బడాలి.. ప్రజలతో మమేకం అయిపోవాలి.. అని అన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉందో తెలుసుకోండి నా చుట్టూ.. నా ఇంటు చుట్టూ తిరిగే బదులు ప్రజల చుట్టూ తిరగండి అని అన్నారు. వారికి స్ట్రీట్ లైట్ కావాలా.. డ్రైనేజ్ సిస్టం మంచిగా ఉందా? రోడ్ వేయాలా.. ఎటువంటి సమస్యలు ఉన్నాయో గ్రామాల్లో తిరిగి సమస్యను పరిష్కరించినట్లయితే మనకు ఖచ్చితంగా ప్రజల నుంచి గుర్తింపు ఆదరణ వస్తుందని తెలిపారు. ఎవరైతే ప్రజల ఆదరణ పొందుతారో నేను వారికి ఆదరిస్తాను.. నా చుట్టూ తిరిగిన వారికి ఎవరికీ కూడా ఆదరించనని అన్నారు. ఎంపీటీసీలు సర్పంచులు ఎంపీపీ జడ్పీటీసీలు ఎవరైనా సరే ప్రజల దగ్గర డబ్బులు తీసుకోవద్దన్నారు. ప్రజలకు స్కీమ్‌లు.. ఇప్పిస్తే ఏదైనా సరే ఒక్క రూపాయి కూడా తీసుకోవద్దని తెలిపారు. తీసుకుంటే చెడ్డ పేరు వస్తుంది.. డబ్బులు ఇస్తే పని చేశారు కదా అని అనే అవకాశం ఉంటుందని అన్నారు. పార్టీలో అంతర్గతంగా ఎటువంటి సమస్య ఉంటే తనతో చెప్పాలన్నారు. లేకపోతే వారిపై పార్టీ పరంగా క్రమశిక్షణ రాహిత్య చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూష ప్రేమ నాయక్ వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మల్లారం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్స్ ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలోని రాంనగర్‌లోని రామ మందిరం వద్ద ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సహకారంతో జెడ్పినిధుల నుండి మంజూరైన హైమాస్ట్ లైట్లు సోమవారం మండల కేంద్ర ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డ్ మెంబర్ మన్సూర్ భూమేష్ మాట్లాడుతూ..... మండల కేంద్రంలో వాడవాడ సిసి రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. తనవంతుగా నాయకపోడు కుల సంఘానికి సుమారు ఇరవై వేల సామాగ్రి విరాళంగా ఇచ్చానని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రం చామకూరముత్యం, ఎస్ జి తిరుపతి, ఉప సర్పంచ్ భరత్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, ఎంపిటిసి రాజు, మేక హనుమండ్లు, రమణారెడ్డి, కండక్టర్ నారాయణ, మంద సాయన్న, సీతారాం, శ్రీను, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో

ప్రతిభ కనబరిచిన కేజిబివి విద్యార్థులు



ప్రతిభకనపర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థినిలు ఏడు మెడల్స్ సాధించడం జరిగిందని మంగళవారం పాఠశాల ప్రత్యేక అధికారిని భవాని తెలిపారు. అండర్ 18 బాలికల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడంతో పాటు టోర్నమెంట్లోనే ఫాస్టెస్ట్ రన్నర్‌గా పాఠశాలకు చెందిన ఈ మైథిలిని అథ్లెటిక్ అసోసియేషన్ వారు ప్రత్యేక సన్మానించారని తెలిపారు. బాల్కొండ మండల అంతర పాఠశాలలో క్రీడోత్సవాలలో మార్చిఫాస్టులో ప్రథమ స్థానం, సబ్ జూనియర్ గర్ల్స్ ఖోఖో లో ప్రథమ స్థానం సాధించడంతోపాటు అథ్లెటిక్స్ లో ఏడు పతకాలు కూడా సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం విద్యార్థినిలను అభినందించారు.

అంగన్‌వాడి కేంద్రాల తాళాలు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

పది రోజుల నుంచి వారి సమస్యలపై నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్ వాడి ఉపాధ్యాయులు విధులకు హాజరుకాకపోవడంతో అంగన్ వాడి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు మంగళవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, పంచాయితీ సెక్రటరీ విజయ్ కుమార్ ఐకేపీ సిబ్బంది వివోఏలకు అంగన్ వాడి కేంద్రాల తాళాలు అప్పగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ నిరవధిక సమ్మెవల్ల కేంద్రాలోని పిల్లలకు (భోజన, విద్య, వైద్య) సదుపాయాలు కొనసాగేలా ముందస్తు చర్యలు తీసుకుందని అన్నారు.కార్యక్రమంలో ఐకేపీ సీసీ ప్రణీత, వీవోఏలు అరుణ, కావ్య, అర్చన, భాగ్యలక్ష్మి, రాధిక తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బాబాపూర్ గ్రామ శివారులో పంట పొలాల్లో మతిస్థిమితం లేని వ్యక్తి పడి ఉండటాన్ని చూసిన భీంగల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేష్ బాధితున్ని బురద నుండి బయటకు తీసి స్నానం చేయించారు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సను అందజేయించి మానవత్వాన్ని చాటుకున్నారు . ఈ సందర్భంగా సురేష్‌ను ఎస్సై హరిబాబు, ప్రజలు అభినందించారు

వినాయక ..కేసీఆర్ మనసు మార్చు

వినాయక విగ్రహానికి అంగన్‌వాడీ టీచర్ల వినతి

మోకాళ్లపై నిలబడి, బతుకమ్మ ఆడుతూ నిరసన

నవతెలంగాణ-విలేకరులు

బాల్కొండ: అంగన్వాడీ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది రోజుల నుండి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. అందులోభాగంగా మంగళవారం అంగన్‌వాడీ ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి, బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్ ,ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలి, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కల్పించలేదని, దీనివల్ల అంగన్వాడి ఉద్యోగులు చాలా నష్టపోతున్నామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విఆర్ఏ, గ్రామపంచాయతీ జూనియర్ సెక్రెటరీలను క్రమబద్ధీకరణ చేసింది,ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, తమను కూడా పర్మినెంట్ చేయాలని అంగన్వాడి ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో మండల ప్రధాన కార్యదర్శి భూస విజయ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడి టీచర్లు వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీగా వెళ్లి సమ్మె శిబిరానికి సమీపంలో ఉన్న వినాయక మండపంలో వినాయక విగ్రహానికి వినతి పత్రం సమర్పించి ప్రభుత్వానికినిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శరత్ కు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం పరిష్కరించకపోగా పని భారం పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల ఆలన పాలన, పోషక ఆహారం అందించడంలో ముందు బాగాన ఉంటున్న అంగన్వాడీలను ప్రభుత్వం చిన్నచూపు చూడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ భీమ్ గల్ ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు యమున, మండల అధ్యక్షురాలు మంజుల, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలో తాసిల్దార్ ఆఫీస్ ముందు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు 8వ సోమవారం సమ్మెను కొనసాగించారు. వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వం మమ్మల్ని రోడ్డుపైకి తెచ్చిందని అన్నారు. ఇప్పటికైనా తమ బాధను అర్థం చేసుకొని వెలుగు నింపాలని ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, రజిత, సుమలత, రాణి పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మద్దతు తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు



కంఠేశ్వర్ : మాట్లాడుతున్న రమేష్‌బాబు

అంగన్వాడీ టీచర్లు మంగళవారం వినాయకుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఇప్పటికైనా కేసీఆర్ మనసు మార్చి డిమాండ్లను పరిష్కరించేటట్లు చేయాలని వినాయకుడి వేడుకుంటున్నట్టు తెలిపారు. మోకాళ్లపై నిలబడి వినాయకుడికి ప్రార్థనలు చేశారు.

జక్రాన్‌పల్లి: సోమవారం వినాయక చవితి సందర్భంగా అంగన్వాడీ టీచర్లు ఆయాలు సమ్మె శిబిరంలో వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ సమస్యలు తీర్చాలంటూ వినాయకుడికి విన్నవించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా వినాయక విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు 100 మంది వరకు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంలో అంగన్ వాడి ఉపాధ్యాయులు గణేష్ మండపం వద్ద వినాయక విగ్రహానికి తమ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొందరగా పరిష్కరించాలని కోరుతూ వినతిని అందజేశారు. అంతకుముందు జిల్లాలోని మోస్రాకు చెందిన మంగ అనే అంగన్ వాడి ఉపాధ్యాయురాలు మృతి చెందడంతో రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు వసంత, అమినా బేగం, వాణి, జ్యోతి, వరలక్ష్మీ, పద్మ, భాగ్యలక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు..

కంఠేశ్వర్ : అంగన్వాడీ మహిళలపట్ల ప్రభుత్వ వివక్షత విడనాడాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన అంగన్వాడీ ఉద్యోగులు 9వ రోజు సమ్మెలో సిపిఎం జిల్లా కార్యదర్శి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.రమేష్ బాబు మాట్లాడుతూ.. తొమ్మిది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మినీ వర్కర్లు తమ సమస్యల పరిష్కారంకోసం రోడ్డున పడి నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయటం సరైనది కాదని అన్నారు. మహిళల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని ఆయన విమర్శించారు.

మహిళలపట్ల అపారమైన గౌరవం ఉందని ప్రకటిస్తూనే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది మహిళలు తమ సమస్యల పరిష్కారం కోసం గళమెత్తి పోరాడుతుంటే వారిని చర్చలకు పిలిచి సమస్యలను సానుకూలంగా పరిష్కరించే బదులు మరింత జటిలం చేయటం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. ధరలు ఆకాశాన్ని అంటుతూ ఉంటే అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచకుండా అంత్యక్రియల ఖర్చులను ప్రకటించటం బాధ్యతారహితమని అన్నారు. వెంటనే అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం నెలకు 26వేలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, అధికారుల వేధింపులను, బెదిరింపులను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మరింత తాత్సారం చేస్తే అంగన్వాడీ ఉద్యమం ఉధృతం అవుతుందని అన్నారు. అందుకు జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. స్వర్ణ, ప్రాజెక్టు నాయకులు సరిత, జరీనా సునీత, లలిత, అంజలి విజయ, శివరాజమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు ముందుగా నిన్న అనారోగ్యంతో మరణించిన మోసరా సెక్టార్ కు చెందిన మంగ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు.

భీంగల్: భీమ్గల్ ప్రాజెక్టు ముందు అంగన్వాడి కార్యకర్తలు మోకాళ్లపై కూర్చుని నిరసనలు తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు పండగలను సైతం లెక్కచేయకుండా సమ్మెలో కూర్చుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని వారు తెలిపారు ఈ సమ్మెలో ప్రమీల గంగ లక్ష్మి సునీత విజయ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : అంగన్వాడి ఉద్యోగ, కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసురాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పట్టణంలోని అంగన్వాడి సమ్మె శిబిరాన్ని సందర్శించి దాసు మాట్లాడారు. రాష్ట్రంలో 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత కల్పించి, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా 5 లక్షల చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018 అక్టోబర్లో కేంద్రం పెంచిన వేతనం అంగన్వాడీ టీచర్లకు 1500 వేల్పరులకు 750 మినీ వర్కర్లకు 1250 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఏరియాస్‌తో సహా చెల్లించాలని ఆయన అన్నారు. సిఐటియు ఆర్మూర్ మండల అధ్యక్షులు కుతాడి ఎల్లయ్యలి మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు పది లక్షలు, ఆయాలకు ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి సెంటర్లకు ప్రక్క భవనాలు నిర్మించి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే మహిళల కోపానికి కెసిఆర్ ప్రభుత్వం బలికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు అనిల్ , ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగరాజు, బీఎస్పి నాయకులు రాజేశ్వర్ సంఘీభావాన్ని, సంపూర్ణ మద్దతుని ప్రకటించి, ప్రసంగించారు. కార్యక్రమంలో అంగన్వాడి సంఘం నాయకులు అరుణ లక్ష్మీ సునంద, అనిత పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



భీంగల్‌లో మోకాళ్లపై కూర్చున్న అంగన్‌వాడీ టీచర్లు



జక్రాన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు



ముప్కాల్‌లో వినాయక విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు, ఆయాలు

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలి

ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లోఉన్న 5177 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే ఫీజు దీక్ష నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని నిజామాబాద్ నగర 10వ వార్డ్ కమిటీ సమావేశం అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 5177 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలు ఉన్నాయని అన్నారు. వీటి వలన విద్యాభ్యాసం పూర్తి అయ్యి పై చదువుల రీత్యా లేదా ఉద్యోగాల రిత్యా వెళ్లాలనుకునే వారికి స్కాలర్షిప్ రాని కారణంగా ప్రైవేటు విద్యాసంస్థలు వారికి సర్టిఫికెట్స్ ఇవ్వడంలేదన్నారు. ధరలకు అనుగుణంగా స్కాలర్షిప్, రీయింబర్స్‌మెంట్ పెంచి ఇవ్వాలని, పెండింగ్ స్కాలర్షిప్‌కు సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇచ్చే రకంగా ప్రభుత్వం కృషి చెయ్యాలని అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ఫీజు విద్యార్థుల దగ్గరుండి తీసుకోకుండా ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. ఈ ప్రధాన డిమాండ్లతో ఈనెల 22న ఫీజు దీక్ష నిరసన కార్యక్రమాన్ని చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులందరూ పాల్గొని ఈ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు హెచ్ గణేష్ ,హెచ్ వేణు, 10వ డివిజన్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాహుల్ నాయకులు శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు మహేష్

రుణమాఫీ పత్రాలు, రుణాల అందజేత

ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతని, ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతని ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్ అన్నారు.మంగళవారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి సహకార సొసైటీలో రుణమాఫైన రైతులకు రుణమాఫీ పత్రాలతో పాటు తిరిగి రైతుల అవసరాలకు అనుగుణంగా నూతనంగా రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సాంబార్ మోహన్ మాట్లాడుతూ.. రైతులందరికీ తప్పకుండా రుణమాఫీ వర్తి స్తుందని, ఈ నెల చివరి వరకు బ్యాంకు, సహకార సొసైటీల్లో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు ప్రకటించిన కటాఫ్ తేది లోని తీసుకున్న రైతులకు ఈ నెల చివరి వరకు తమ తమ ఖాతాల్లో జమ అవుతాయని, రుణమాఫీ కానీ

రైతులు ఎవ్వరూ కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. అనంతరం పలువురికి నూతనంగా వ్యవసాయ రుణాలను అందజేశారు. కార్యక్రమం లో సహకార సొసైటీ కార్యదర్శి తేజ గౌడ్, క్యాషియర్ రాజన్న, డైరెక్టర్లు, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రుణమాఫీ పత్రాలు అందజేస్తున్న చైర్మన్

వ్యక్తి అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-నందిపేట్

డొంకేశ్వర్ మండల కేంద్రంలోని అన్నారం గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం......ఆంధ్ర నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన అలికే సాయిలు(35) రెండు సంవత్సరాలుగా నూతపల్లి గ్రామంలో ఓ వ్యక్తి వద్ద పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఐతే అదే గ్రామంలో కూలి పని చేస్తున్న అతని స్నేహితుడు సోమవారం రాత్రి సాయిలును వెంటబెట్టుకొని మద్యం తాగడానికి ఊరి బయటకు వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. ఉదయం స్థానికులు ఊరి ప్రధాన ద్వారం వద్ద కాల్వలో పడి ఉన్నాడని సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

అనుమానిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

నవతెలంగాణ-బాల్కొండ

అనుమానిత వ్యక్తులతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిఎస్సై కే .గోపి సూచించారు. కొన్ని రోజులుగా నార్త్ ఇండియా కి చెందిన చెడ్డి గ్యాంగ్ పక్క జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరు ఐదు లేదా ఆరు గురు వ్యక్తులు ఒకేసారి గుంపుగా వచ్చి వరుసగా వాళ్ళకి దొరికిన ఇళ్ళల్లో దొంగతనానికి పాల్పడి పారి పోతారని అన్నారు. గ్రామాల్లో ఎవరికైనా ఎక్కడైనా అనుమానిత కొత్త వ్యక్తులు కనిపిస్తే 100 నెంబర్ కి కానీ, 8712659860, 8712659859 నెంబర్ లకు కాల్ చేసి తెలపాలని కోరారు. ఎవరైనా ఏదైనా పని మీద ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్ళేది ఉంటే ఇంట్లో బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచొద్దన్నారు. ముఖ్యంగా బీరువాలు, అల్మారాల్లో పెట్టవద్దని సూచించారు.

అర్ధరాత్రి రోడ్డుమీద తిరగొద్దు

పట్టణ సీఐ నరహరి

నవతెలంగాణ-కంఠేశ్వర్



యువత అర్ధరాత్రి సమయంలో అనవసరంగా రోడ్లమీద తిరగరాదని పట్టణ సిఐ నరహరి తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ జయరాం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి, టాస్క్‌ఫోర్స్ సిఐ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది నిజామాబాద్ పట్టణంలో అర్ధరాత్రి రోడ్లపై ఒక్కో ద్విచక్ర వాహనంపై ముగ్గురు చొప్పున తిరుగుతున్న 66 మంది యువకులను, వారి ఇరవై మూడు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకొని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నరహరి మాట్లాడుతూ నిజామాబాద్‌లో అర్ధరాత్రి సమయంలో యువకులు ఒక్కొక్క బండిమీద ముగ్గురు చొప్పున తిరుగుతూ మద్యం సేవించి విపరీతమైన వేగంతో ద్విచక్ర వాహనాలను నడపడం వలన అదుపుతప్పి ప్రమాదవశత్తు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పోలీసు యొక్క సూచనలను పాటించకుండా తిరిగినట్టయితే వాహనాలను సీజ్ చేయడంతో పాటుగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సోమవారం పట్టుబడిన యువకులకు మరియు వారి కుటుంబ సభ్యులకు మంగళవారం నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ నిజామాబాద్‌లో నిజామాబాద్ పట్టణ సీఐ నరహరి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ నాలుగో పట్టణ ఎస్సై సంజీవ్, సిబ్బంది రమేష్, అనిల్, భూరాజ్, రమేష్, రాకేష్ పాల్గొన్నారు.

జంగమ జిల్లా కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మల్లన్నగుట్ట వద్ద జంగమ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్, కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రేవంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ స్వామి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, స్వామి, బైరయ్య, వీరభద్రప్ప, ప్రభుదేవ్, దిలీప్, శశిధర్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాలూరలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ



నవతెలంగాణ-బోధన్

గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా పౌరులు కృషి చేయాలని కోరుతూ మంగళవారం సాలూర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిలు, ఎఫ్ఏ సయీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకర తేలిన అంతర్రాష్ట్ర రహదారి

- **ఇటీవల నామమాత్రపు మరమ్మతులు**

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ సమీపంలో గల మర్రి మైసమ్మ ఆలయం నుంచి నాగన్‌పల్లి వరకు గల అంతరాష్ట్ర రహదారిని గత కొన్ని రోజుల క్రితం అధికారులు నామమాత్రంగా మట్టితో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు. దాంతో అది కంకర తేలి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తుంది. గత కొన్ని సంవత్సరాల నుండి గుంతల మయంగా ఉన్న ఈ రహదారిని అధికారులు నామా మాత్రంగా గుంతలు పూడ్చి చదును చేశారు. దాంతో గుంతలు పూర్తిగా చదునుగాక అందులో ఉన్న కంకర పైకి తేలి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారింది. వాహనాలు వెళ్తున్న క్రమంలో కంకర రాళ్లు ఇబ్బంది పెడుతున్నాయని ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ కంకర తేలిన రహదారిపై గత వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనదారుని బైక్ చైన్ తెగిపోవడంతో ఇబ్బందులు పడవలసి వచ్చింది. ఈ రహదారిని పూర్తిస్థాయిలో నాణ్యతతో మరమ్మతులు చేయాలని పలుమార్లు ప్రయాణికుల కోరిన ఎవరు పట్టించుకోవడం లేదు. నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ రహదారిపై నుంచి వాహనాలు ప్రయాణిస్తున్న క్రమంలో దుమ్ము, ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కావున నాణ్యమైన మరమ్మతులు చేస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి కంకర తేలిన అంతరాష్ట్ర రహదారిని పూర్తి నాణ్యతతో మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కంకర తేలిన రోడ్డుపై ప్రయాణిస్తున్న బస్సు.. ఎగిసిపడుతున్న దుమ్ము



కంకర తేలిన రోడ్డు

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మరణించిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (25) దుస్తులు ఉతడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి నీటమునిగి మరణించాడు. కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా బట్టలు మాత్రమే కనిపించగా చుట్టు పక్కల ఎంత వెతికినా అనిల్ కనిపించలేదు. మంగళవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా అనిల్ శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

వ్యాధుల నివారణకు దోమతెరలు తప్పనిసరిగా వాడాలి

- **బాపునగర్ సర్పంచ్ సునీత రవి**



దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రస్తుత రోజుల్లో విషపూరిత జ్వరాలతో పాటు అంటు వ్యాధులు అంటు రోగాలు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధుల నివారణకు దోమ తెరలను తప్పనిసరిగా వాడాలని బాపునగర్ సర్పంచ్ మెగావత్ సునీత రవి అన్నారు. మంగళవారం మండలంలోని బాపునగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ తన సొంత నిధులతో సుమారు 50 దోమ తెరలు కొనుగోలు చేసి గ్రామస్తులకు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ మెగావత్ సునీత రవి చేతుల మీదుగా దోమతెరలను ఆయన పంపిణీ చేయించారు. అలాగే ఇతర వ్యాధులు పిల్లలకు పెద్దలకు ప్రబలకుండా ముందస్తు ఆరోగ్య జాగ్రత్త విషయంలో వైద్యాధికారి రాజకుమార్ ఔషధాలు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన మంచినీటిని మాత్రమే వాడాలన్నారు.

నేడు ఘన్‌పూర్‌కు స్పీకర్ రాక

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలం ఘనపూర్ గ్రామంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి, శంకుస్థాపనలు చేసేందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విచ్చేస్తున్నారని, ఈ కార్యక్రమానికి పలు గ్రామాల, మండల కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మండలాధ్యక్షులు మూడ్ అంబర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

గణేష్ మండపాల వద్ద యువత సమన్వయం పాటించాలి

- **రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్**

నవతెలంగాణ-రెంజల్

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండలంలోని యువత సమన్వయం పాటించాలని రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ స్పష్టం చేశారు. రెంజల్ మండలంలో 110 గణేష్ మండపాలను చిన్నారుల నుంచి గ్రామ కమిటీ సభ్యుల వరకు ఏర్పాటు చేశారని, వారందరూ గణేష్ మండపాల వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ అధికారుల అనుమతులను తీసుకొని కరెంటును వాడుకోవాలి తప్ప డైరెక్టు కనెక్షన్ తీసుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు సైతం గణేష్ మండపాల వద్ద వాహనాలను నెమ్మదిగా నడిపించాలని, చిన్నారులు ఆనందోత్సవంలో ఆడుకుంటూ ఉంటారని వాహనదారులకు ఆయన సూచనలు ఇచ్చారు. నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరు సమన్వయం పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో శోభయాత్రలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు. నిమజ్జన సమయంలో డీజేలు వాడకూడదని, యువత మద్యం సేవించకుండా ప్రశాంతంగా నిమజ్జోత్సవంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

బోధన్‌లో యమహా షోరూం ప్రారంభం



యమహా షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని అనిసా నగర్‌లో నూతనంగా వై.ఎం.యమహా ద్విచక్ర వాహనాల షోరూంను బోధన్ మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల విక్రయాల వ్యాపారంలో నిర్వాహకులు ఉత్తమ లాభాలు సాధించాలని, అలాగే వినియోగదారులకు ఉత్తమసేవలు అందించాలని సూచించారు. అనంతరం వై.ఎం.మోటర్స్ షోరూం యజమాని మహేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ, సర్పంచులు శ్రీనివాస్‌రావు, తూము రవి, సర్పంచ్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వృత్తి కోర్సుకు పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన మిఠాయి ఐశ్వర్య కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి కోర్స్ ఎంపీహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) కావలసిన మెటీరియల్‌ను డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుల అందజేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పుస్తకాలు వితరణ చేస్తున్న దృశ్యం

తడి పొడి చెత్తపై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సదాశివనగర్ గ్రామంలోని పాఠశాలలో విద్యార్థిని-విద్యార్థులకు స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రజలు చెత్తబుట్టలను ఉపయోగించి తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త బండికి ఇవ్వాలని సూచించారు. రోడ్ల పైన చెత్త వేసిన వారికి జరిమానా విధిస్తామని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు రావని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వడ్ల రాజేందర్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులతోనే సొసైటీలు అభివృద్ధి

- **సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి**

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

రైతులతోనే సొసైటీలు అభివృద్ధి చెందుతాయని సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో స్వల్పకాలిక రుణాలు మాఫీ అయిన సభ్యులకు 36 మందికి రూ.27,55,000, నూతన సభ్యులు 60 మంది సభ్యులకు రూ.30,72,500 స్వల్పకాలిక రుణాలు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకే సహకార సంఘాలు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. సొసైటీలో రుణాలు పొంది వ్యవసాయం చేసుకుని దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి మళ్లీ కడితే రైతుల ద్వారా వచ్చిన వడ్డీల ద్వారా సహకార సంఘాలు అభివృద్ధి జరుగుతాయని తీసుకున్న రుణాలు తిరిగి కట్టడం ద్వారా మళ్లీ ఎవరికైనా రుణాలు పొందే అవకాశం ఉంటుందని, తీసుకున్నవారు రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.హన్మంతురెడ్డి, డైరెక్టర్ సాయగౌడ్, దస్తారెడ్డి, సర్పంచ్ తిరుమలరెడ్డి, భుషప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండెరావు పటేల్, సెక్రటరీ సందీప్ కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రుణాల మంజూరు చెక్కులు అందజేత

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **లేకుంటే సెప్టెంబర్ 28 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె**
- **తహసీల్దార్‌కు వినతి అందజేత**

నవతెలంగాణ-రెంజల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం మండల తహసీల్దార్ రామచందర్‌కు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపుకు బడ్జెట్‌ను విడుదల చేయాలని, కొత్త మెనూకు బడ్జెట్‌ను కేటాయించాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయపాత్రకు అప్పజెప్పడాన్ని తక్షణమే విరమించుకోవాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, సుమేధ, శిరీష, స్వరూప, మోను బాయ్, లలితా, శోభ, లావణ్య నాగలక్ష్మి, సాయన్న, సౌందర్య , శబ్బు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

- **నియోజకవర్గ బీఎస్పీ నాయకులు బోగుడామిది సాయిలు**

నవతెలంగాణ-పిట్లం

అంగన్వాడీ టీచర్లు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాలని జుక్కల్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ బాధ్యులు బొగడమీది సాయిలు పిలుపునిచ్చారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీఎస్పీ పార్టీ తరపున ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు చిన్న సమస్యల కోసం చేస్తున్న సమ్మెను అణగదొక్కడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. తమ ఉద్యోగం పర్మినెంట్ చేయాలని, జీతభత్యాలు పెంచాలని సమ్మె చేస్తుంటే మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారన్నారు. కరోనా సమయంలో వారి జీవితాలతో పాటు కుటుంబ సభ్యుల జీవితాలను పనంగా పెట్టి గడపగడపకూ సేవలందించి త్యాగం చేశారని గుర్తు చేశారు. 26 వేల రూపాయల జీతం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరినా అంగన్వాడీ టీచర్ల సమస్య చాలా చిన్న సమస్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మూడు దఫాలుగా ఎన్నికల సమయంలో ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చినా ఆయనకు అంగన్వాడీ టీచర్లు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో గ్రామపంచాయతీ వర్కర్లు, వెలుగు, వీఆర్వో, వీఆర్ఏ సమ్మెలకు వెళ్లి పలకరించిన పాపాల పోలేదన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మృతిచెందితే ప్రభుత్వ పరంగా 20వేలు, 10 వేల రూపాయలు చెల్లించడం హాస్యాస్పదమన్నారు. రసాయన ఎరువులపై అధిక ధరలు పెంచి రైతుల నడ్డివిరుస్తురన్నారు. నియోజకవర్గంలోని దళిత కుటుంబాలకు దళితబంధు రూపంలో కొట్లాట పెడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలలో గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బహుజన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ గంగారాం, అసెంబ్లీ అధ్యక్షులు విఠత్వార్ రోహిదాస్, మండలాధ్యక్షులు లాలు, మద్నూర్ మండల ఉపాధ్యక్షులు ప్రేమ్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న సాయిలు

చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం సిగ్గుచేటు

నవతెలంగాణ-వర్ని

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం సిగ్గుచేటని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కరాటే రమేష్ మాట్లాడుతూ దేశం గౌరవించేలా ఐటీ రంగాన్ని అభివృద్ధి పరిచింది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని గుర్తుచేశారు. విద్య, వైద్యాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. అలాంటి మహనీయుడిని అరెస్టు చేయడం జగన్ మూర్ఖత్వమని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శి విట్టల్, మండలాధ్యక్షులు ఇందూర్ సాయిలు, రెడ్డి చౌదరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కాయితి లంబాడీల మండలాధ్యక్షునిగా బన్సీలాల్



ఎన్నికైన మండల కమిటీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో శుక్రవారం కాయితీ లాంబాడీల మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మాజీ సర్పంచ్ బన్సీలాల్ సముందర్ తాండ, ఉపాధ్యక్షులు సాబ్ చందర్లే, బామాన్ హసరాజ్, ప్రధాన కార్యదర్శి సజన్నెలాల్, కార్యదర్శి బామాన్ పాచులాల్, కోశాధికారి కుమార్ సింగ్, సలహాదారులు మోతిలాల్ లాగ్గిరంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బర్దవల్ బన్సీలాల్ మాట్లాడుతూ 'నాపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు' అని తెలిపారు. కాయితీ లంబాడీల సమస్యలపై నిరంతరం పోరాడుతానని, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు రాజేందర్ బామాన్, ఉపాధ్యక్షుడు నరేష్, తాండల అధ్యక్షులు, పెద్దలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలో రెంజల్ జడ్పీటీసీ ఫోటో..



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న గోపీకృష్ణ

నవతెలంగాణ-రెంజల్

బోధన్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు రెంజల్ బీజేపీ జడ్పీటిసి మేక విజయ ఫోటోలు పెట్టడం శోచనీయమని రెంజల్ బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ స్పష్టం చేశారు. గతంలో ఇలాగే ఫ్లెక్సీలో ఆమె ఫోటోను పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులపై రెంజల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రెంజల్ మండల ఉపాధ్యక్షులు యోగేష్, మాజీ మండల అధ్యక్షులు మేక సంతోష్, నాయకులు పార్ధ రమేష్ తదితరులున్నారు.

ఎన్నారై సౌదీ ధర్పల్లి మండల అధ్యక్షునిగా ఉట్నూర్ గంగాధర్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ సౌదీ శర్పల్లి మండల అధ్యక్షునిగా ఉట్నూర్ గంగదాస్‌ను నియమించినట్టు మంగళవారం తెలిపారు. ఉట్నూర్ గంగదాస్ మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని బిసి ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వారికి అండగా ఉంటానని ఎల్లవేళల సంక్షేమ సంఘం కోసం పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బీసీ అధ్యక్షులు బట్టు స్వామి, ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్, ఎన్ ఆర్ ఐ కువైట్ ఉపాధ్యక్షుడు గున్నల విక్రమ్ సౌదీ ఉపాధ్యక్షులు పీర్ల దేవదాస్ (కురుమ) బీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంఠేశ్వర్

చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ..చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మెల్సీ కవిత పోరాటం పోరాటం చేశారన్నారు. కవిత కృషితో కేంద్ర ప్రభుత్వం మహిళ లకు 33% రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ముఖ్యంగా చట్ట సభల్లో రిజర్వేషన్లు ఉండాలని కోరుకుంటూ ఎమ్మెల్సీకి, మహిళలకు శుభకాంక్షలు తెలిపారు.

గడపగడపకు బీఆర్ఎస్



నవతెలంగాణ - ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో మంగళవారం ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా సినీ ప్రముఖురాలైన సావిత్రి (శివజ్యోతి) దంపతులను స్వగ్రామమైన నాగంపేట్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటెయ్యాలని కోరుతూ పార్టీ నాయకులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్, నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ తిరిగి అధికారంలోకి వస్తుందని సావిత్రి దంపతులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగంపేట్ మాజీ సర్పంచ్ గిరిధవర్ ముత్తెన్న, ఎంపీటీసీ సభ్యులు మోహన్ రెడ్డి, ముత్యం రెడ్డి, గంగాధర్, రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

హామీలను కాంగ్రెస్ పార్టీ తప్పకుండా నెరవేరుస్తుంది

పీసీసీ డెలీగేట్ కుంట రమేష్

నవతెలంగాణ-భీంగల్

ఈనెల 17వ హైదరాబాద్‌లో జరిగిన విజయభేరి బహిరంగ సభ లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే , మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పార్లమెంటు సభ్యులు రాహుల్ గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ సంక్షేమ ఫలాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా అందజేస్తుందని పిసిసి డెలిగేట్ కుంట రమేష్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయభేరి సభకు తరలివచ్చిన జనాన్ని చూసి బిఆర్ఎస్ పార్టీ అసత్య ఆరోపణలు చేస్తున్నదని ఇందులో భాగంగానే విజయభేరి లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ పథకాలపై రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆయన తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొట్టమొదటి క్యాబినెట్ బేటిలోనే ఈ పథకాలకు ఆమోదం తెలుపుతామని సభకు వచ్చిన లక్షలాది జనుల సాక్షిగా, మీడియా ఛానల్ సాక్షిగా ప్రకటించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సభలో ప్రకటించలేదని, కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చెయ్యదని రైతులను, ప్రజలను తప్పు దోవ పట్టించే తమ వంకర బుద్ధిని మరోసారి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని తెలిపారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను ఎంపీపీ కుంచాల విమల రాజు, ప్రజా ప్రతినిధులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న , మండల కో ఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులుగా లక్ష్మీనర్సయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోఉపాధ్యాయునిగా పి లక్ష్మీ నర్సయ్య మండలంలోని మగ్గిడి పాఠశాల నుండి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్ టీయూ అధ్యక్షులు లక్ష్మణ్ పటేల్, గద్దె గంగాధర్, భూమేశ్వర్ ,రాస శ్రీనివాస్ , రాజేందర్ తదితరులు శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు.

స్వామి బై బాయ్ బ్లడ్ ఫౌండేషన్ ద్వారా 463 మందికి రక్తదానం

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్ ద్వారా 463 మందికి రక్తదానం చేయించినట్లు మదరి స్వామి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మదారి స్వామి హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ గత సంవత్సరం స్వామి బాయి బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇది ఏర్పాటుచేసి ఈనెల 18 నాటికి సంవత్సరం పూర్తి అయిందని తెలిపారు. ఈ సంవత్సరకాలంలో స్వామి బాయ్ బ్లడ్ బ్యాంక్ ద్వారా 463 మందికి రక్తదానం చేయించినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ లతా దేవరాజు కృతజ్ఞతలు తెలిపారు. మునుముందు మరింతమంది రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని మాదారి స్వామి తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ భారత్ జాగృతి అధ్వర్యంలో ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద కవిత చిత్రపటానికి విద్యార్థినులు, మహిళా నేతలు, జాగృతి నాయకులు పాలాభిషేకం మంగళవారం నిర్వహించారు. మొదట కేసీఆర్ కమాన్ నుండి క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ గా తరలి వచ్చారు. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం గళం వినిపించడంలో ఎమ్మెల్సీ కవిత ఎప్పుడు ముందు ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకులు అపర్ణ ,సుమన రెడ్డి,విశాలిని రెడ్డి,భారత జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి రావు,నరాల సుధాకర్, లక్ష్మి నారాయణ , బి ఆర్ ఎస్ యువ నాయకులు చిన్ను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ కార్డుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

విజయబెరి సభలో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు పథకాలకు సంబంధించిన కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో సిడబ్ల్యుసి మెంబర్, బీహార్ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు ఎమ్మెల్సీ మదన్మోహన్ జా ఆవిష్కరించారు. పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో సోమవారం ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ సభలో ప్రకటించిన పథకాల గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తూ వివరించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ , పీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్ర మోహన్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి,సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి,పిసిసి ప్రచార కమిటీ మెంబర్ కోల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, సత్యనారాయణ మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ హబిబ్ ఫ్లోర్ లీడర్ మహిమూద్ అలి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు కాళ్లగడ్డ శ్రీకాంత్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ ర్యాలీలు, మానవహారాలు

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్, హాస కొత్తూర్ గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛత హి సేవ పక్షోత్సావాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ తీశారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ మరుగు దొడ్డి నిర్మించుకొని వాడుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. గ్రామ ప్రధాన కూడలిలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బషీరాబాద్‌లో సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు సాగర్, గణేష్, లావణ్య సీసీ భాగ్యలక్ష్మి, విఓఏలు, హాస కొత్తూర్‌లో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోపాల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం సిర్పూర్ గ్రామంలో సర్పంచ్ సామ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ వినాయక మట్టి విగ్రహాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలంలోని మంచిప్ప గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో స్వచ్ఛతాహీ సేవ నా వంతు కర్తవ్యం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామపంచాయతీ దగ్గర మానవహారం నిర్వహించారు.



మాక్లూర్: స్వచ్ఛతా పాటిద్దామని ప్రమాణం చేస్తున్న గ్రామస్తులు

ఈసందర్భంగా సర్పంచ్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ మంచిప్ప లో భాగస్వాములు కావాలని అన్నారు. బహిరంగంగా చెత్త వేయకుండా , చెత్త బండిలోనే చెత్త వేసేటట్టుగా మురికి కాలవలలో చెత్త నిలువకుండా అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గేమ్ సింగ్ ,ఉప సర్పంచ్ జగదీష్ యాదవ్, జై భారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, పంచాయతీ వార్డు సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలో స్వచ్ఛతాహి వారోత్సవాలను స్థానిక సర్పంచ్ అశోక్ కుమార్ అధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, గ్రామంలో స్వచ్ఛత, పరిశుభ్రతను పాటించాలి తెలిపారు. పాత టైర్ల లో నీటి నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దార్గల అనిత, మండల కో ఆప్షన్ మెంబర్ కొక హైమ్మద్, వార్డు మెంబర్లు లక్ష్మి నారాయణ, లక్ష్మన్, తిరుమల నర్సా గౌడ్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల బదిలీలు

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో మంగళవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు కనక గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, ఎంఈఓ ఆంధ్రయ్య ప్రధానోపాధ్యాయుడు కనక గంగాధర్‌ను శాలువాలతో సత్కరించారు. ఇటీవల ప్రభుత్వ నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్ చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆకుల భజన్న, కార్యదర్శి గంగారం, అల్లకొండ గంగాధర్, ఎస్ఎంసి చైర్మన్ సాయన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్ పాల్గొన్నారు.

భీంగల్: మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను బదిలీ చేస్తున్నట్లు వరంగల్ ఆర్ జె డి ఉత్తర్వులను విడుదల చేసింది. మండలంలోని జాగిర్యాల్ జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇన్చార్జి మండల విద్యాధికారి స్వామి పట్టణ కేంద్రంలోని బోయిగల్లి బాలికల ఉన్నత పాఠశాలకు, బడా భీంగల్ జెడ్పిహెచ్ఎస్ లో పని చేస్తున్న రమేష్ ముచ్కూర్ జెడ్ పిహెచ్ఎస్‌కు, మెండోరా జెడ్‌పిహెచ్ ఎస్ లో పనిచేస్తున్న సుజాత అర్గుల్ జెడ్పిహెచ్ఎస్‌కు, పల్లికొండ జడ్పిహెచ్ఎస్ లో పనిచేస్తున్న హరినాథ్ న్యాల్ కల్ జెడ్ పి హెచ్ ఎస్ కు, భీంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శంకర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ చేస్తున్నట్లు ఆర్జెడి ఉత్తర్వులను విడుదల చేసింది.

డిచ్‌పల్లి: ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలుగా రాజేశ్వరీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న తిర్మన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ అధ్వర్యంలో రాజేశ్వరి కి ఘనంగా సన్మానించారు.రాజేశ్వరీ మోపాల్ మండలంలోని



కమ్మర్‌పల్లిలో.. ప్రధానోపాధ్యాయున్ని సన్మానిస్తున్న వీడీసీ

కంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. బదిలిపై తిర్మన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చారు. కొన్ని ఏళ్లుగా ఈ పాఠశాలకు పూర్తి స్థాయిలో ప్రధానోపాధ్యాయులు లేక శ్రీనివాస్ రావు ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులుగా వీధులు నిర్వహిస్తు గ్రామస్తుల సహాయ సహకారం తో పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి విశేషంగా కృషి చేశారు. దానికి గాను ఈ నెల ఆరున మంత్రి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు మాదం వెంకటి, కిషన్, తెడ్డు మహేందర్, మహేష్, లింగన్న, చెక్‌పవర్ ఎర్రోళ్ల సాయన్న, కొమురయ్య, పుట్నాల శ్రీనివాస్, శివరాం, సాయిలు, రమేష్ ,శ్రీను, గంగేశ్వర్, పాఠశాల చైర్మన్ ఇమ్మడి సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : హెచ్ఎం రాజేశ్వరిని సన్మానిస్తున్న వీడీసీ

ఆరు గ్యారంటీ పథకాలతో బిత్తరపోయిన బీజేపీ, బీఆర్ఎస్

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో బీఆర్ఎస్, బిజెపి పార్టీలు బిత్తర పోయాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఈనెల 17న తుక్కుగూడలో జరిగిన విజయభేరి సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో కూడిన అభయహస్తం గ్యారంటీ కార్డు గురించి విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హంధాన్ తో కలిసి వివరించారు. రాహుల్ గాంధీ అన్నట్టుగా బిజెపి, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకటేనని అన్నారు. దానికి ప్రత్యేక ఉదాహరణ సెప్టెంబర్ 17న కాంగ్రెస్ పార్టీ సభ భగ్నం చేయాలని ఉద్దేశంతో వారంతా కలిసి వేరువేరుగా సభలు నిర్వహించి కాంగ్రెస్ విజయభేరి సభను నిర్వీర్యం చేయాలని ప్రయత్నం చేశారని తెలిపారు. ప్రజలు విజయభేరి సభకు భారీగా తరలివచ్చి వారి కుట్రలను భగ్న చేశారని అన్నారు.

విజయబేరి సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు బిఆర్ఎస్ మరియు బిజెపి నాయకుల గుండెల్లో రైళ్ల పరిగెత్తేలా చేస్తున్నాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ప్రతినెల 2500 రూపాయలతో పాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని, రైతు భరోసా ద్వారా ప్రతి ఏటా 15 వేల రూపాయలు అందిస్తుందని తెలిపారు. రైతుబంధు పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం భూస్వాములకు మేలు చేసే విధంగా మాత్రమే దానిని రూపొందించిందని కానీ రైతు భరోసా పథకం ద్వారా కౌలు రైతులకు కూడా ప్రతి ఏటా 15 వేల రూపాయలు అందిస్తుందని ఆయన తెలిపారు.భూమిలేని వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు సంవత్సరానికి అందజేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం ఐదు లక్షల రూపాయలు అందజేస్తుందని, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని అందజేస్తుందని, యువ వికాసం ద్వారా విద్యార్థులకు 5 లక్షల రూపాయల విద్యాభరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుందని, అలాగే చేయూత పథకం ద్వారా 4000 రూపాయల నెలవారి పింఛను అందిస్తుందని, 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అందజేస్తుందని పేర్కొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ మాట్లాడారు. అనంతరం ఆరు పథకాలతో కూడిన అభయ హస్తం గ్యారెంటీ కార్డును ప్రదర్శించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మీసాల సుధాకర్ రావు,రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు జావిద్ అక్రమ్,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణు రాజ్, సేవాలాల్ అధ్యక్షుడు సంతోష్, బీసీ సెల్ అధ్యక్షులు నరేంద్ర గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం పాల్గొన్నారు.



పథకాల గ్యారెంటీ కార్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంతో పాటు వివిధ గ్రామాలలో గణనాథులు సోమవారం కొలువుతీరాయి. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో స్టూడెంట్ యూత్ ఆధ్వర్యంలో నగరే డప్పు కళా బృందం ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్ నగరే డప్పు రమేష్ కళా బృందం పట్టణ పరిధిలోని మామిడిపల్లికి చెందిన స్టూడెంట్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ ప్రతిష్టాపన ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా యువజన విభాగం సీనియర్ నాయకులు మల్యాల నర్సారెడ్డి యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవి డెవలపర్స్ అధినేత బిజ్జు దత్తాద్రి ఆధ్వర్యంలో వెయ్యి మట్టి గణపతులను ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ ఉచితంగా పంపిణి చేశారు. పట్టణంలోని జిరాయిత్ నగర్ యందు రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ హౌసింగ్ బోర్డ్ హనుమాన్ టెంపుల్ స్ఫూర్తి సేవ సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షులు విద్యా గోపి కృష్ణ, తులసి పట్వారి ,విద్య ప్రవీణ్, రాస రాము తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: వినాయక చవితి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి వినాయక విగ్రహాలనే నెలకొల్పాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్చక పురోహిత్ ప్రముఖ్ శశాంక్ జోషి, తమ్మల కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ రెడ్డి, కైలాష్, మేనేజర్ లక్ష్మణ్, శీను, సుంకరి మహిపాల్, చిట్టిబాబు, హన్మాన్లు పాల్గొన్నారు.

ముప్కాల్: వినాయక చవితి సందర్భంగా గ్రామస్తులకు ముప్కాల్ ఉప సర్పంచ్ బ్రహ్మదండి సువర్ణ-లింగం దంపతులు మట్టి గణపతిలను పంపిణీ చేశారు. వారి అమ్మ-నాన్నలైన బ్రహ్మదండి మల్లుబాయి-చిన్నయ్య గార్ల జ్ఞాపకార్థం ఉచితంగా మట్టి గణపతిలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, దాసరి నర్సింగ్ దాస్, కుమ్మరి రవి, బ్రహ్మదండి వెంకట్, మోహన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు..



ఆర్మూర్: గణపతులు పంపిణీ చేస్తున్న బిజ్జుదత్తాద్రి

కమ్మర్ పల్లి : మండలంలోని హాసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను సోమవారం పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మట్టి గణపతి విగ్రహాలను సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ గ్రామస్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్థులు మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేయాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రంగులతో తయారు చేసిన విగ్రహాలు నీటి కాలుష్యానికి, పర్యావరణానికి హాని చేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వసంత్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌ను కలిసిన ఎస్సై



నుడా చైర్మన్‌కు బొకే అందజేస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ ఎస్ఐ ఎల్. రామ్ ఇటీవల కొత్తగా నియమించబడిన నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వినాయక చవితి శుభాకాంక్షలు కూడా తెలిపారు.

మసీదులో సీసీ కెమెరాల ఏర్పాటుకు వితరణ



దేవేందర్‌కు సీసీ కెమెరాలను అందజేస్తున్న రాజేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి మసీదులో ఏర్పాటు చేసేందుకు సీసీ కెమెరాలను స్థానిక రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ కొమ్ముల రాజేందర్ వితరణ చేశారు. మసీదులో రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్న మైనార్టీ సోదరుల కోరిక మేరకు కొమ్ముల రాజేందర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు ముందుకు వచ్చారు. నాలుగు సీసీ కెమెరాలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ చేతుల మీదుగా మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాపరెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళా శవం లభ్యం

నవతెలంగాణ - మాక్లూర్



మండలంలోని బోర్గం (కె) గ్రామ శివారులోని చెరువులో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఎస్సై సుదీర్ రావు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికులు చెరువులో మహిళ శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా నిర్వహించి, శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించారు. మహిళ శవాన్ని గుర్తు పట్టిన వారు మాక్లూర్ పోలీసులను కలవాలని తెలిపారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం (కలెక్టరేట్)లో ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగిన పూజ కార్యక్రమాలలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు వినాయక ఉత్సవాలు జరిపేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రోజువారీగా వివిధ శాఖల ఆధ్వర్యంలో వినాయకుడికి పూజలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగానే రెండవ రోజైన మంగళవారం ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రమేష్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమన్ రెడ్డి, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోగల శ్రీ ఓం గణేష్ మండలి మొదటి పూజా కార్యక్రమానికి అదనపు డిప్యూటి పోలీస్ కమీషనర్ (ఎల్అండ్ఓ) ఎస్. జయారామ్ కుటుంబసమేతంగా పాల్గొని పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (ట్రాఫిక్) సతీష్, ఆర్.ఎస్.ఐలు గణేష్ మండలి సభ్యులు గంగాధర్, కోటేశ్వర రావు, గోవర్ధన్ రెడ్డి, రమణారెడ్డి, సాయిలు, చిన్నయ్య, గంగాధర్, గాంధీ, రఘునాద్ సింగ్, రవీంధర్ స్పెషల్ పార్టీ సిబ్బంది, హెడ్క్వార్టర్ లోని వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ వర్గీకరణ కోసం దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం 5వ రోజు నిరసన దీక్ష ఎంఆర్పిఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టగా మంగళవారం ఎమ్మెస్ ఎఫ్ నిజామాబాద్ జిల్లా ఇంఛార్జి బైరపోగు శివ మాదిగ ప్రారంభించారు. ఈసందర్భంగా కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ఈ నెల 18 నుండి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ మీద స్పష్టమైన తేది ప్రకటించాలని, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రైవేట్ బిల్లు పెట్టి కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. బీఆర్ఎస్ కూడా పార్లమెంట్‌లో ఎంపీలు వర్గీకరణ కోసం బీజేపీ మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీక్షలో వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షులు కంటేశ్వర్ బీరప్ప, విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు పెద్దోళ్ల యమున, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు రోడ్డ స్వప్న, అబ్బమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రోడ్డ ప్రవీణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 20, 2023 | www.navatelangana.com

నీలా ప్రధానోపాధ్యాయులుగా ఇల్తెపు శంకర్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఈ.శంకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు గ్రామ కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శంకర్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టడం తమ విద్యార్థుల అదృష్టమని వారు స్పష్టం చేశారు. అలాగే మండలంలోని దూపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా గణేశ్ రావు, రెంజల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఆంజనేయులు, తాడిబిలోలి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా రేఖ, కూనెపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా అనురాధ బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు రాఘవేందర్, రాఘవాచారి, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్ తాహెర్, ఆనంద్, అబ్బయ్య, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ప్రొసీడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-గాంధారి



మండలంలోని గుర్జల్ గ్రామానికి చెందిన సొప్పరి స్రవంతికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. గత సంవత్సరంలో గుర్జాల్ ఫీల్డ్ అసిస్టెంట్ సొప్పరి హన్మంతు చనిపోవడంతో దానికి సంబంధించిన ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్ కాపీని మృతుడి భార్య సొప్పరి స్రవంతికి ఎమ్మెల్యే సురేందర్ చేతుల మీదుగా రూ.220000 ప్రొసీడింగ్స్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో యం.పి.పి. రాధ బలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపిడివో సతీష్ కుమార్, గుర్జల్ గ్రామ ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయక చవితి



గాంధారిలో కొలువుదీరిన గణనాథుడు

- ఘనంగా పూజలు

నవతెలంగాణ-విలేకరుల బృందం



బోధన్‌లో..



రెంజల్‌లో..



రామారెడ్డిలో గణనాథుడితో చిన్నారుల సందడి

బోధన్ : వినాయక చవితి పండగను సోమవారం బోధన్ ఉమ్మడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ఉత్సాహంగా వినాయక విగ్రహాలను వాహనాలలో తరలించి గ్రామాలలో ప్రతిష్ఠించారు. బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి బుద్దె రాజేశ్వర్ దంపతులు సాలూరలోని విఘ్నేశ్వర గణేష్ మండలిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శారద, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఇల్తెపు శంకర్, గ్రామ పెద్దలు కేజీ గంగారాం, ఇల్తెపు రమేష్, సంజీవ్, శివకాంత్ పటేల్, ఎస్ఆర్ కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో తండాలో సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా గణనాథుల ప్రతిమలు కొలువు దీరాయి. మండపాల నిర్వాహకులు ఈ సంవత్సరం భారీ ప్రతిమలను నెలకొల్పేందుకు నిర్వాహకులు పోటీపడ్డారు. అలాగే మండపాల ఏర్పాటుకు ప్రాధాన్యతను ఇచ్చారు. మండల కేంద్రంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలు ప్రత్యేక అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రెంజల్ : మండలంలో వినాయక చవితి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో గుంజే గంగాధర్ విగ్రహ దాత ఆధ్వర్యంలో శ్రీ రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. రామాలయ కమిటీ అధ్యక్షులు శంకర్, కోశాధికారి మధు కరణ్, చందాలు చేసి గణనాథుడికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రాయ నర్సు, గ్రామపెద్దలు రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

వినతినిచ్చి.. మంత్రిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కనీస వేతనం కల్పించాలని కోరుతూ మంగళవారం మహిళా అభివృద్ధి స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను నసురుల్లాబాద్ మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కలీల్ మాట్లాడుతూ.. ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వ స్కీమ్ వర్కర్స్ పేరుతో పనిచేసినా ఉద్యోగులతో సమానంగా జాబ్‌చార్ట్ ప్రకారం పూర్వ ప్రాథమిక విద్య టీచర్స్‌గా పనిచేస్తూ ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణీ, బాలింత స్త్రీలు 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు సేవలందిస్తున్నామని, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఐసిడిఎస్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తూ వయోభారం, అనారోగ్యాలతో ఇటీవలీ కాలంలో చాలామంది మరణించారని, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వినాయకునికి పూజలు

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేసేలా సీఎం కేసీఆర్‌కు మంచి మనసు ప్రసాదించు కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు దీక్ష శిబిరంలో వినాయకుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు విజయ్, రాజు, దిలీప్, యూసుఫ్, రేఖ, సుజాత, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జెడ్పిటిసి తీగల తిరుమలగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో స్వచ్ఛభారత్‌పై విద్యార్థుల చేత సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి తీగల తిర్మాల్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలలో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ చేయించి ర్యాలీలు తీయడం, మానవహారాలు నిర్వహించినట్టు తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి అందరికీ తెలిసే విధంగా అవగాహన కల్పించారు. (స్వచ మిత్రాల)ను సన్మానం చేయడం, తడి చెత్తతో వర్మి కంపోస్ట్ తయారు చేయడంపై అవగాహన కల్పించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దివ్యరాణి, కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

కనీస వేతనం కావాలి



నవతెలంగాణ-సదాశివనగర్ : తమకు గౌరవ వేతనం కాదు.. కనీస వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో నిరహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించాలన్నారు. ఈయస్ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కల్పించాలన్నారు. వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలని, ప్రభుత్వం మొండివైఖరి వీడనాడాలన్నారు. కార్యక్రమంలో సునంద, సిద్ధలక్ష్మీ, వీణబాయ్, లలిత తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రి కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కోసం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్, మండల పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ నసురుల్లాబాద్ గ్రామంలో స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల ప్రజల సౌకర్యార్థం కోటి 40 లక్షల రూపాయలతో నూతన భవన నిర్మాణం కోసం స్థలం పరిశీలించారు. బాన్సువాడ బోధన్ నిజామాబాద్ వెళ్లే రహదారి పక్కన గల నసురుల్లాబాద్ మండల ప్రజలు ఆసుపత్రి కోసం వివిధ పట్టణాలకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని, అందుకు దాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టిలో పెట్టుకొని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలన చేశామని డిఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మణ్ సింగ్, పెర్క శ్రీనివాస్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం ఎంపిక కాగానే పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఫోరం కన్వీనర్ కంది మల్లేష్, లక్ష్మీనారాయణగౌడ్, మైషగౌడ్, సాయిలు, ప్రతాప్‌సింగ్, ఎంపీఓ రాము, ఆరోగ్యశాఖ అధికారులు రవీందర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు అండగా కేసీఆర్

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే

సీఎం కేసీఆర్ ఆడపిల్లలకు అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి మండలానికి చెందిన 17మంది, లింగంపేట్‌కు చెందిన 06 మందికి, నాగిరెడ్డిపేట్‌కు చెందిన 07 మందికి, గాంధారి 03 మండలాలకు చెందిన 33 మందికి కళ్యాణలక్ష్మి - షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే స్వంత ఖర్చులతో ప్రతి లబ్దిదారురాలికి పట్టు చీరను పంపిణీ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి, లింగంపేట్ మండలాలకు చెందిన రూ.26,77,500 విలువ గల (60) సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అదే విధంగా గాంధారి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన కె.శోభకు రూ.2,50,000, లింగంపేట్ మండలం మోతే గ్రామానికి చెందిన జి.శివారెడ్డికి రూ.2,00,000 విలువగల సీఎంఆర్ఎఫ్-ఎల్వోసి పంపిణీ చేశారు. లింగంపేట్ మండలం బానాపూర్ గ్రామానికి చెందిన మెంబొజిపేట్ నరేష్, నల్లమడుగు గ్రామానికి చెందిన కొండా రాజులు, గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన సిరిగిరి అనంతయ్య ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.5,00,000 చొప్పున రూ.15,00,000 విలువ గల 03 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. భారీ వర్షాల కారణంగా ఇటీవల నాగిరెడ్డిపేట్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఎరుగడిండ్ల రాజు, గాంధారి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన పిట్ల రవి మరణించిన కారణంగా బాధితుల ఒక్కో కుటుంబానికి రూ.4,00,000ల చొప్పున మొత్తం రూ.8,00,000 విలువగల (02) ఉత్తర్వులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదేవిధంగా, గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సొప్పరి హన్మంతు ఇటీవల మరణించిన కారణంగా బాధితుని కుటుంబానికి రూ.2,20,000/- ఎక్స్‌గ్రేషియా ఉత్తర్వులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధి దేశానికి మార్గదర్శకంగా ఉందని, ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంపద సృషించబడి సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఆర్డీఓ ప్రభాకర్, నియోజకవర్గ మండలాల ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నూతన మండలం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే సురేందర్‌కు తీర్మానం ప్రతులు అందజేత



తీర్మానప్రతులు అందజేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-గాంధారి

నూతన మండలం ఏర్పాటు చేయాలని ఎల్లారెడ్డి శాసన సభ్యులు జాజాల సురేందర్‌కు గాంధారి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తీర్మానం ప్రతులను అందజేశారు. గాంధారి మండలంలోని గట్టు కింద మొండిసడక్‌ను నూతన మండలం ఏర్పాటు కోరకు ఎల్లారెడ్డి శాసన సభ్యులు జాజాల సురేందర్‌ను కలిసి నూతన మండలం కోసం తీర్మానం కాపీని అందజేశారు. కార్యక్రమంలో గాంధారి ఎంపీపీ రాధాబలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, గండివేట్ సర్పంచ్ ఫారుక్, ముదెల్లి సర్పంచ్ పిట్ల కళావతి లక్ష్మణ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివాజీ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

9వ రోజుకు అంగన్‌వాడీ టీచర్ల సమ్మె

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ టీచర్స్ సమ్మె తొమ్మిదవ రోజుకు చేరింది. మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ల మండలాధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను వెంటనే నేరవేర్చి అమలు చేసేదాక తమ సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. అంతేకాకుండా రూ.26000 జీతాలను పెంచి, ప్రతి నెలా సమయానికి వేతనాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ, కవిత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు దళిత బంధు, బీసీబంధులో ప్రాధాన్యత కల్పిస్తాం

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ-బోధన్



పెంచిన ఫించన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధు, దళిత బంధు, మైనారిటీ బంధు పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి వారిని ఆదుకుంటామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో దివ్యాంగులు, బీడీ టేకేదారులకు ఆయన పెంచిన ఫించన్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ దేశంలో కూడా అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. బోధన్ నియోజకవర్గంలో 45వేల మందికి వివిధ రకాల పింఛన్లను అందిస్తున్నామని అన్నారు. 80శాతం వరకు గల కుటుంబాలకు 10కోట్ల రూపాయల పింఛన్లు అందిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని 3068 మంది వికలాంగులకు పింఛన్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఉన్న 3016 /-రూపాయల పింఛన్లు సీఎం కేసీఆర్ 4000లకు పెంచారని దాంతో దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధు, దళిత బంధు, మైనార్టీ బంధు పథకాలలో తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కాలం కావడంతో ప్రతిపక్షాలు చెబుతున్న మోసపూరిత హామీలకు పట్టించుకోవద్దని కోరారు. ఏ దేశంలో కూడా సీఎం కేసీఆర్ లాంటి పథకాలు అమలు కావడం లేదని, అది అమలు చేయడం ఒక్క తెలంగాణ రాష్ట్రానికే సాధ్య మని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండించారు. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న కొంతమంది కావాలని విమర్శి స్తున్నారని అలాంటివారిని నిలదీయాలని పేర్కొన్నారు. అలాగే 386 మంది వికలాంగులకు తనవంతుగా ప్రత్యేక కానుకలను అందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, నర్సయ్య, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించిన విజయభేరి బహిరంగ సభలో సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలతో పాటు, గతంలో ప్రకటించిన పథకాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తుందని ప్రతి ఇంటింటికి తీసుకెళ్లాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గ్యారంటీ కార్డు పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించి, గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు బస్టాండ్ ఆవరణలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్యాల నర్సారెడ్డి, గంగారెడ్డి, చింతకుంట కిషన్, బండి ప్రవీణ్, బీపేట నరసింహులు, పరశురాం, జగన్, నామాల రవి తదితరులు పాల్గొన్నారు.